ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

తమిళనాడు
TAMILNADU

ఆదివారం 6 ఏప్రిల్ 2025



నేడు రామేశ్వరానికి మోదీ

- పాంబన్ కొత్త రైలు వంతెన ప్రారంభం
- రామేశ్వరం ఆలయ సందర్శన



ప్రధాని ప్రారంభించనున్న కొత్త రైలు వంతెన



చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం ఉదయం రామేశ్వరం రానున్నారు. మోదీ పర్యటన నేపథ్యంలో మండపం ప్రాంతం, రామేశ్వరంలో సుమారు 5 వేలమంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రామనాథపురం జిల్లా మండపం ప్రాంతాన్ని రామేశ్వరం దీవిని కలుపుతూ రైల్వేశాఖ కొత్తగా రూ.555కోట్లతో, అధునాత సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించిన పాంబన్ రైలు వంతెనను ప్రధాని ప్రారంభించనున్నారు. ప్రస్తుతం శ్రీలంకలో పర్యటిస్తున్న మోదీ ఆదివారం ఉదయం 10.40 గంటలకు అక్కడి అనురాధపురం నుండి భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్‌లో బయలుదేరి 11.45 గంటలకు రామేశ్వరం సమీపంలోని మండపం హెలీపాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి కారులో మండపం రహదారి వంతెన మీదుగా ప్రయాణించి పాంబన్ రైలు వంతెనకు ఎదురుగా రహదారిపై ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక ప్రాంతానికి విచ్చేస్తారు. అక్కడి నుంచి రిమోట్ ద్వారా కొత్త రైలు వంతెనను ప్రారంభిస్తారు. ఆ తర్వాత ఆ వంతెన దిగువన నౌకలు ప్రయాణించేలా ఏర్పాటు చేసిన భారీ లిఫ్టను కూడా ప్రారంభిస్తారు. ఆ సమయంలో మదురై, తిరునల్వేలి, తూత్తుకుడి, తాంబరం ప్రాంతాల నుండి తీసుకొచ్చిన రైళ్ళను నడుపనున్నారు. ఆ నాలుగు రైళ్లలో 6000 మంది రైల్వే ఉద్యోగులు, సిబ్బంది వంతెనపై మొదటిసారి ప్రయాణించనున్నారు. కార్యక్రమాలన్నింటినీ మోదీ పావుగంటలోగా ప్రత్యేక వేదికపై నుండి వీక్షించనున్నారు. అక్కడి నుండి కారులో మధ్యాహ్నం 12.25 గంటలకు రామేశ్వరంలోని పర్వతవర్ధినీ సమేత రామనాథస్వామివారి ఆలయానికి వెళతారు. ఆదివారం శ్రీరామనవమి కావటంతో మోదీ రామనాథస్వామిని కూడా దర్శించేలా తన పర్యటన ఖరారు చేసుకున్నారు. దర్శనం తర్వాత మోదీ అక్కడి నుండి పాంబన్ వంతెన ప్రారంభోత్సవ సభ జరిగే రామేశ్వరం బస్‌స్టేషన్ వద్ద పర్యాటక శాఖ ఆధ్వర్యంలోని 'ఆలయం' అనే గెస్ట్‌హౌస్ మైదానం వరకు రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి, కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ఎల్.మురుగన్, రాష్ట్ర మంత్రులు తంగం తెన్నరసు, రాజకన్నప్పన్ తదితరులు పాల్గొంటున్నారు. తరువాత రామేశ్వరం - తాంబరం మధ్య నడిచే పాంబన్ ఎక్స్‌ప్రెస్‌ను జెండా ఊపి ప్రారంభిస్తారు.

రామేశ్వరం, పాంబన్‌లో హై అలర్ట్...

ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో రామేశ్వరం, పాంబన్ ప్రాంతాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. గత వారం రోజులుగా ఢిల్లీ నుండి వచ్చిన ప్రత్యేక భద్రతా దళం ఉన్నతాధికారులు ప్రధాని పర్యటించే మార్గాలు, సభా వేదిక ప్రాంతాన్ని, రామేశ్వరం ఆలయ ప్రధాన వీధుల్లో తనిఖీలు చేపట్టారు. ఇప్పటికే రామేశ్వరంలోకి ప్రవేశించే వాహనాలను పోలీసులు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసిన మీదటే అనుమతిస్తున్నారు. రామేశ్వరం ఆలయాన్ని ప్రధాని మోదీ సందర్శించనుండటంతో ఆదివారం ఉదయం ఎనిమిది నుండి మధ్యాహ్నం 3 గంటల దాకా భక్తులను దర్శనానికి అనుమతించకుండా కట్టుదిట్టం చేస్తున్నారు.



పాంబన్ రైలు వంతెన వద్ద బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు



మండపం ప్రాంతంలో బందోబస్తుకు వచ్చిన పోలీసులు

4 రహదారి ప్రాజెక్టులకు శంకుస్థాపన...

ఆ వేదికపైనుంచే వాలాజాపేట- రాణిపేట, విల్లుపురం - పుదుచ్చేరి, పూండియన్ కుప్పం - చట్టనాథపురం, చోళపురం - తంజావూరు ప్రాంతాల్లో ప్రధాన రహదారుల ప్రాజెక్టులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమాలన్నీ గంటలోగా ముగియనున్నాయి. మధ్యాహ్నం 2.30 గంటలకు కారులో బయలుదేరి మండపం హెలిపాడ్ చేరుకుంటారు. అక్కడి నుండి హెలికాప్టర్‌లో బయలుదేరి మదురై విమానాశ్రయం చేరుకుంటారు.

4 గంటలపాటు వాహనాల రాకపోకలు బంద్...

ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో ఆదివారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రామనాథపురం - రామేశ్వరం జాతీయ రహదారిలో వాహనాల రాకపోకలను పోలీసులు నిలిపివేస్తున్నారు. ఇదే విధంగా రామేశ్వరంలో అత్యవసర సర్వీసులకు సంబంధించిన వాహనాలను మాత్రమే నగరంలోకి అనుమతిస్తున్నారు. రామేశ్వరం ఆలయానికి వచ్చే భక్తులు పోలీసుల ఆంక్షల ప్రకారం తమ పర్యటన కార్యక్రమాలను మార్చుకోవాలని కూడా అధికారులు ప్రకటించారు. రామేశ్వరం ఆలయం, పరిసరాలు, పాంబన్ వంతెన ప్రాంతం, మండపం హెలిపాడ్ తదితర ప్రాంతాల్లో సాయుధ బలగాలతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేఉశారు. ఓ అడిషనల్ డీజీపీ పర్యవేక్షణలో ముగ్గురు డీసీపీలు 14 మంది ఎస్పీలు, 13 మంది ఏఎస్పీలు, 25 మంది ఏసీపీలు సహా 5000 మంది పోలీసులతో పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇక పాంబన్ రైలు వంతెన సముద్రతీర ప్రాంతం కావడంతో కోస్ట్‌గార్డ్, రాష్ట్ర సముద్రతీర భద్రతా దళానికి చెందిన గస్తీ నౌకలు ప్రధాని కార్యక్రమాలు ముగిసేంతవరకూ తీరం పొడవునా నిఘా వేయనున్నాయని కోస్ట్‌గార్డ్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

దశాబ్దకాలంలో గణనీయ అభివృద్ధి

- రాష్ట్ర ఆర్థిక వృద్ధి రేటు 9.69 శాతం
- గణాంకాలను వెల్లడించిన కేంద్రం
- సీఎం స్టాలిన్ హర్షం

అడయార్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక వృద్ధిరేటు గత దశాబ్దకాలంలో ఎన్నడూ లేనివిధంగా 9.69 శాతం నమోదైందని, ఈ విషయం కేంద్రం ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలతో స్పష్టమైందని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించడం వల్లే ఇది సాధ్యమైందని వ్యాఖ్యానించారు. కేంద్ర గణాంకాలు, ప్రణాళికా మంత్రిత్వ శాఖ ఇటీవల ఆయా రాష్ట్రాలు సాధించిన ప్రగతి నివేదిక విడుదల చేసింది. దేశంలోనే అధిక వృద్ధి రేటు సాధించిన రాష్ట్రంగా తమిళనాడు నిలిచిందని అందులో పేర్కొంది. పైగా గడిచిన పదేళ్ళకాలంలో 9.69 శాతం వృద్ధి రేటు సాధించడం ఇదే తొలిసారని వెల్లడించింది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి రేటు 8.59 శాతంగా నమోదైందని గుర్తు చేసింది. రాష్ట్ర మొత్తం ఉత్పత్తి విలువ 2023-24 సంవత్సరంలో రూ.15, 71,368గా ఉండగా, 2024-25లో రూ.17, 23,689గా పెరిగింది. ఆర్థిక వృద్ధిరేటులో తమిళనాడు తర్వాత ఆంధ్రప్రదేశ్ 8.21 శాతం ఉండగా, రాజస్థాన్ 7.55 శాతంగా ఉందని తెలిపింది. అయితే, గుజరాత్, ఉత్తరప్రదేశ్, బిహార్‌తో సహా 14 రాష్ట్రాల వృద్ధిరేటును కేంద్రం వెల్లడించలేదు. ఇదే విషయంపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 9.69 శాతం వృద్ధిరేటుతో దేశంలోనే తొలిరాష్ట్రంగా తమిళనాడు నిలిచిందన్నారు. స్థిరమైన పాలన, స్పష్టతతో కూడిన దూరదృష్టితో మన రాష్ట్రంతో పాటు రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు ద్రావిడ మోడల్ పాలనకు తొలిప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఒక ట్రిలియన్ అమెరికన్ డాలర్ ఆర్థిక వ్యవస్థకు చేరుకోవమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఆ దిశగానే పయనిస్తున్నామని సీఎం స్టాలిన్ పేర్కొన్నారు.



నీలగిరి జిల్లా పర్యటనకు శనివారం ఊటీ చేరుకున్న ముఖ్యమంత్రి స్టాలిన్‌కు దారిపొడవునా స్వాగతం పలుకుతున్న స్థానికులు

రాజ్‌భవన్‌లో కవి కంబ చక్రవర్తి వేడుకలు

35 మందికి గవర్నర్ సత్కారం

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి రామాయణాన్ని తమిళంలో అందమైన కావ్యంగా మలచిన కవి కంబచక్రవర్తి కీర్తి ప్రతిష్ఠలను కొనియాడేలా రాజ్‌భవన్‌లో శనివారం ఉదయం 'కంబ చిత్తిరం విళా' పేరుతో ప్రత్యేక వేడుకలు నిర్వహించారు. రాష్ట్రమంతా కంభరామాయణంపై ప్రవచనాలు చేసిన ప్రవచనకర్తలకు, వివిధ రంగాల్లో విశేష సేవలందించిన ప్రముఖులకు రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అలెయన్స్ కంపెనీ పునర్ముద్రించిన 'కంభరామాయణ' గ్రంథాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు.



గవర్నర్‌తో సత్కారాలు అందుకున్న ప్రముఖులు

దక్షిణాది జిల్లాల్లో భారీ వర్షాలు

ప్యారీస్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావం వల్ల రాష్ట్రంలోని దక్షిణాది జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి, భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోని దక్షిణకోస్తా జిల్లాల్లో గత రెండ్రోజులుగా కుండపోతగా వర్షాలు కురిశాయి. ఇదే తీవ్రత మరో మూడు రోజులు కొనసాగుతుందని నుంగంబాక్కంలోని భారత వాతావరణ కేంద్రం సూచించింది. కోస్తా తీరాల్లో బలమైన ఈదురు గాలులు వీస్తాయని, కొన్నిచోట్ల పిడుగులు పడే ప్రమాదముందని వాతావరణ శాఖ శనివారం హెచ్చరించింది. శుక్రవారం నీలగిరి, కోవై, నాగపట్నం, తిరుప్పూర్, దిండుగల్, తెన్‌కాశి, కారైక్కాల్ జిల్లాల్లో అత్యధికంగా వర్షపాతం నమోదైంది. కొన్ని గంటల పాటు ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు నిలిచిపోవడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. పరిశ్రమల నగరం తిరుప్పూర్‌లో సుమారు 10గంటల పాటు ఏకధాటిగా వర్షాలు కురవడంతో జనావాసాల్లో నీరు చేరింది. తిరుప్పూర్‌లోనే 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాగా, కన్నియాకుమారి జిల్లా వాల్పారైలో 10 సె.మీ, కోవై జిల్లాలోని నంబియూర్, సూలూర్‌లలో 8సె.మీ, ఈరోడ్, రామనాధపురం, మండపం, దొండి, పామర్లలో 7నుండి 5 సె.మీ మేరకు వర్షం కురిసింది. రాజధాని నగరం చెన్నైలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. ఇదిలావుండగా ఈ తాజా వర్షాల వల్ల రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత సాధారణ కంటే 2నుండి 5 సెల్సియస్ తక్కువగా నమోదైనట్లు ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలిపింది.

తేని జిల్లాలో ఐదిళ్లు ధ్వంసం

చెన్నై, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుండి శనివారం వేకువజాము వరకు కురిసిన కుండపోత వర్షాలకు జనజీవనం స్తంభించింది. రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లాలోని కంభం మునిసిపాలిటీ 26, 27, 28 వార్డులలోని ప్రధాన రహదారులలో శనివారం ఉదయం రెండడుగుల లోతున వర్షపు నీరు వరదలా ప్రవహించింది. ఇదే విధంగా 29వ వార్డులోని ఆదిశక్తి వినాయకుడి ఆలయ వీధి వాననీటితో దీవిగా మారింది. ఆ వీధిలో నివసిస్తున్నవారంతా ఇళ్ళను విడిచి పక్క వీధులలో రాత్రంతా జాగారం చేశారు. శనివారం ఉదయం ఆ వీధిలో వర్షాలకు బాగా తడిసి నానిపోయిన ఐదిళ్లు ధ్వంసమయ్యాయి. ఆ ఇళ్లలో ఎవరూ బసచేయకపోవటంతో ప్రాణనష్టానికి తావులేకుండా పోయింది. ఇక రాత్రంతా కంభంలోని అన్ని మునిసిపాలిటీ వార్డులలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీనితో ప్రజలు నిదురపోలేకు జాగారం చేయాల్సి వచ్చింది. వర్షాలకు కూలిపడిన ఐదిళ్లకు చెందినవారంతా తమకు ప్రత్యామ్నాయ ప్రాంతంలో ఇళ్లను కేటాయించాలని అధికారుల వద్ద డిమాండ్ చేశారు. వర్షబాధిత ప్రాంతాలను రెవెన్యూ, మునిసిపాలిటీ అధికారులు కూడా పరిశీలించారు.



వర్షాలకు కూలిపడిన ఇళ్లు

చేపాక్కంలో క్రికెట్ సందడి



- తొలిసారిగా మ్యాచ్ తిలకించిన ధోని తల్లిదండ్రులు



టాస్ ముందు ఇరు జట్ల కెప్టెన్లు రుతురాజ్ గైక్వాడ్- అక్షర్ పటేల్



ధోని బ్యాటింగ్

పెరంబూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఐపీఎల్ పోటీల్లో శనివారం చేపాక్కంలో చెన్నై సూపర్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్ జరిగింది. గతంలో జరిగిన రెండు మ్యాచ్‌లు రాత్రి 7.30 గంటలకు ప్రారంభం కాగా, శనివారం మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైంది. దీంతో, ఉదయం నుంచే అభిమానులు స్టేడియం వద్దకు చేరుకున్నారు. పొరుగు రాష్ట్రాలు, ఢిల్లీ జట్టు అభిమానులు శుక్రవారం రాత్రి నగరానికి చేరుకున్నారు.



మ్యాచ్ వీక్షిస్తున్న ధోని తల్లిదండ్రులు



బ్యాటింగ్ చేస్తున్న ఢిల్లీ ఆటగాడు కె.ఎల్.రాహుల్



వికెట్ తీసిన ఆనందంతో సీఎస్కే బౌలర్ ఖలీల్ అహ్మద్

అభిమానుల కోలాహలం...

చెన్నై సూపర్ కింగ్స్ అభిమానులు జెండాలు, టోపీలు, టీ-షర్టులు కొనుగోలు చేసేందుకు ఆసక్తి కనబరిచారు. మరోవైపు ముఖంపై తమ తమ జట్ల పేరును పెయింటింగ్ చేసుకొనేందుకు అభిమానులు పోటీపడ్డారు. మధ్యాహ్నం 2.30 గంటలకు టాస్‌కు ముందే స్టేడియంలోకి అభిమానులను అనుమతించారు.

స్టేడియంలో ధోని కుటుంబ సభ్యుల సందడి...

చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే)కు మహేంద్ర సింగ్ ధోనికి అవినావ సంబంధం ఉంది. జట్టుకు రథసారధిగా ధోని ఐదు సార్లు సీఎస్కేకు ట్రోఫీ అందించారు. రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా ధోనికి పెద్ద ఎత్తున అభిమానులున్నారు. ఈ క్రమంలో, శనివారం జరిగిన మ్యాచ్‌కు ధోని తల్లిదండ్రులు హాజరయ్యారు. చేపాక్కంలో తొలిసారిగా ధోని ఆటను వారు స్వయంగా వీక్షించారు. వారితో పాటు ధోని భార్య సాక్షి, కుమార్తె కూడా మ్యాచ్‌కు వచ్చారు. ధోని బ్యాటింగ్‌కు వస్తున్న సమయంలో వారు చప్పట్లు కొడుతూ ఆహ్వానించారు.

సమాచార దర్శిని

ప్లస్ టూ మూల్యాంకనం ప్రారంభం

పెరంబూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్లస్ టూ మూల్యాంకనం ప్రారంభమైంది. మూల్యాంకనం విధుల్లో సుమారు 43వేల మంది పీజీ ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. మూల్యాంకనం ఈ నెల మూడో వారంలో పూర్తికానుంది. అనంతరం మార్కుల గణన చేపట్టి మే 19వ తేది ఫలితాలు విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది.

మూడు రోజుల 'స్పెషల్ సమ్మర్ టూర్'

పెరంబూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల సందర్భంగా రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మూడు రోజుల ప్రత్యేక విహారయాత్ర ప్యాకేజీ అందుబాటులోకి తీసుకువచ్చింది.. ఈ మేరకు ఆ సంస్థ విడుదల చేసిన ప్రకటనలో... తమ సంస్థ ఆధ్వర్యంలో దేశ, విదేశీ పర్యాటకుల సౌకర్యార్థం సగం రోజు నుంచి 14 రోజుల వరకు 52 రకాల టూర్ ప్యాకేజీలు అందిస్తామన్నారు. పర్యాటకులు, విద్యార్థులు వేసవి సెలవును మరింత ఆస్వాదించేలా మూడు రోజులు ఊటీ, కొడైకెనాల్, ఏర్కాడు, హొగెనేకల్, కుట్రాలం, మైసూరు, బెంగళూరు, మూనార్ తదితర ప్రాంతాలకు ప్రత్యేక టూర్ అందిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ సంస్థ వెబ్‌సైట్, స్థానిక వాలాజా రోడ్డులో ఉన్న సంస్థ ప్రధాన కార్యాలయాన్ని సంప్రదించవచ్చు. అలాగే, 18004251111, 044-25333333, 044-25333444, 7550063121 (వాట్సాప్ నెంబరు) సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

కస్టమ్స్ ఉన్నతాధికారుల బదిలీ

ప్యారీస్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయ కస్టమ్స్ శాఖలో పనిచేస్తున్న 10 మంది ఉన్నతాధికారులను మూకుమ్మడిగా బదిలీ చేశారు. విమానాశ్రయ కస్టమ్స్ శాఖ ప్రిన్సిపల్ కమిషనర్‌గా తమిళ్‌వళవన్ నియమితులైనట్లు శనివారం కస్టమ్స్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. విమానాశ్రయ కస్టమ్స్ శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ శ్రీనివాస నాయక్, అడిషనల్ డిప్యూటీ కమిషనర్ పెరియనన్, అసిస్టెంట్ కమిషనర్లు శరవణన్, ఫణీంద్ర, విశ్వ పీయాగద, అశ్వత్ బాజీ, బాబు కుమార్, జాకబ్, అజయ్ పిడారీ, సుధాకర్ సహా 10 మందిని బదిలీ చేశారు.

ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

పెరంబూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06035 తాంబరం-తిరువనంతపురం ప్రత్యేక ఏసీ ఎక్స్‌ప్రెస్ (శుక్రవారం) ఈ నెల 11 నుంచి మే 2వ తేది వరకు (4 సర్వీసులు) పొడిగించగా, మరుమార్గంలో, నెం.06036 తిరువనతంపురం-తాంబరం ఏసీ ప్రత్యేక రైలు (ఆదివారం) ఈ నెల 13 నుంచి మే 4వ తేది (4 సర్వీసులు) పొడిగించారు.
- నెం.06012 నాగర్‌కోయిల్-తాంబరం ప్రత్యేక సూపర్ ఫాస్ట్ రైలు (ఆదివారం) ఈ నెల 13 నుంచి మే 4వ తేది వరకు (4 సర్వీసులు) పొడిగించారు. మారుమార్గంలో, నెం.06011 తాంబరం-నాగర్‌కోయల్ ప్రత్యేక సూపర్‌ఫాస్ట్ రైలు (సోమవారం) ఈ నెల 14 నుంచి మే 5వ తేది వరకు (4 సర్వీసులు) పొడిగించారు. ఈ రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలిపింది.

కృష్ణా జలాల విడుదల పెంపు

పెరంబూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రం కండలేరు డ్యాం నుంచి కృష్ణా జలాల పరిణామాన్ని పెంచడంతో పూండి జలాశయానికి నీటి రాక అధికమైంది. రాజధాని నగరం చెన్నై ప్రజల తాగునీటి అవసరాలకు కండలేరు డ్యాం నుంచి గత నెల 23వ తేది 500 ఘనపుటడుగుల చొప్పున నీరు విడుదల చేశారు. ఈ నీరు రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఊత్తుకోట జీరో పాయింట్‌కు 28వ తేది వంద ఘనపుటడుగుల చొప్పున చేరుకొని, అక్కడి నుంచి 25 కి.మీ దూరంలో ఉన్న పూండి జలాశయానికి 29వ తేది చేరుకున్నాయి. ఈ నేపథ్యంలో, కండలేరు నుంచి విడుదల చేస్తున్న జలాలను 300 ఘనపుటడుగులకు పెంచడంతో, పూండి జలాశయానికి 270 ఘనపుటడుగుల నీరు చేరుతుంది. పూండి జలాశయం పూర్తి సామర్థ్యం 3,231 మిలియన్ ఘనపుటడుగులు కాగా ప్రస్తుతం 2,544 మిలియన్ ఘనపుటడుగుల మేర నిల్వ ఉంది.. ఇక్కడి నుంచి చెంబరంబాక్కం, పుళల్ జలాశయాలకు 350 ఘనపుటడుగులు, బేబి కాలువ ద్వారా తాగునీటి అవసరాలకు 17 ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నట్లు ప్రజాపనుల శాఖ అధికారులు తెలిపారు.

28 నుంచి డ్రోన్ శిక్షణ శిబిరం

ప్యారీస్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 28 నుండి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉచిత డ్రోన్ శిక్షణా శిబిరాన్ని నగరంలో నిర్వహించనుంది. డ్రోన్ పనితీరు, డిజైనింగ్ తదితరాలపై మూడు రోజుల శిక్షణా శిబిరంలో పాల్గొనే అభ్యర్థులకు నిపుణుల బృందం శిక్షణ ఇవ్వనుంది. ఈ శిక్షణకు సంబంధించిన అదనపు సమాచారం కోసం www.editn.in అనే వెబ్‌సైట్‌ను పరిశీలించడంతో పాటు కార్యాలయ పనిరోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు గిండి సిడ్కో పారిశ్రామిక వాడలో వున్న కార్యాలయానికి నేరుగా వెళ్లి వివరాలు తెలుసుకోవచ్చు. ఫోన్ నెంబర్లు 9360221280 లేదా 9543773337 లను సంప్రదించవలేను.

తిరుప్పూర్ బనియన్ కంపెనీల్లో

భారీ అగ్నిప్రమాదం

ప్యారీస్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బనియన్ పరిశ్రమలకు పేరొందించిన తరుప్పూర్‌లోని పలు బనియన్ కంపెనీల్లో శనివారం తెల్లవారుజామున సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో యంత్రాలు, రూ.లక్షలు విలువచేసే వస్త్రాలు మంటల్లో కాలి బూడిదయ్యాయి. తిరుప్పూర్‌లోని అయ్యంపాళయం సురేష్, శ్రీధర్‌లు 35వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన కర్మాగారంలో ఫ్యాబ్రిక్, ప్యాకింగ్, స్టిచ్చింగ్ తదితర పలు విభాగాల్లో వందలాది మంది కార్మికుల పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి పని ముగించుకుని వారంతా ఇళ్లకు వెళ్ళారు. శనివారం తెల్లవారుజామున ఆ కర్మాగారం నుండి పొగ రావడం చూసిన సెక్యూరిటీ గార్డు వెంటనే కంపెనీ యజమానులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. మూడు ఫైరింజన్లతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు 2 గంటలు మంటలతో పోరాడి అదుపుచేశారు. అదేవిధంగా తిరుప్పూర్ నేత కార్మికుల కాలనీకి చెందిన అన్నాదురై కంచంపాళయంలోని బనియన్ వ్యర్థాల గోదాములో శనివారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో రూ. లక్షలు విలువచేసే ఆస్తులు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఈ రెండు ప్రమాదాలపై కేసు నమోదు చేసిన పోలీసులు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగివుంటుందన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు.



కంపెనీలో ఎగసిపడుతున్న మంటలు (ఇన్‌సెట్‌లో) ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

'యూ ట్యూబ్' ఛానల్ ప్రారంభించిన

తాంబరం కార్పొరేషన్

పెరంబూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తాంబరం కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలవుతున్న ప్రభుత్వ పథకాలు సహా నిర్వహణ అంశాలు ప్రజలు తెలుసుకొనేలా యూ ట్యూబ్ ఛానల్, వాట్సాప్ ప్రారంభించారు. ప్రస్తుతం వాట్సాప్ అందుబాటులో ఉండగా, 'తాంబరం కార్పొరేషన్' అనే ఛానల్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఈ ఛానళ్లను పరిశీలించి ప్రజలు తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చే. అలాగే, 'ఎక్స్', 'ఫేస్ బుక్, ఇన్‌స్టా' తదితర సామాజిక మాధ్యమాల్లో తాంబరం కార్పొరేషన్‌కు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చని అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో పెరిగిన రాబందులు

పెరంబూర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 'బారు' అనే బడే తెల్లమెడ రాబందుల సంఖ్య 142 నుంచి 157కు పెరిగినట్లు అటవీ శాఖ సర్వేలో వెల్లడైంది. రాష్ట్రంలో తెల్లటి మెడ, పొడవాటి ముక్కు, ఎరుపు ముఖం ఇలా మూడు రకాల రాబందులు నివసిస్తున్నాయి. అంతరించి పోతున్న రాబందులను పరిరక్షించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 27, 28 తేదీల్లో రాష్ట్రంలోని 33 ప్రాంతాల్లో రాబందుల గణన చేపట్టారు. గత ఏడాది బారు రాబందుల సంఖ్య 142 ఉండగా ప్రస్తుతం 157కు పెరిగింది. నీలగిరి జిల్లా ముదుమలై పులుల శరణాలయం ఈ రాబందులకు సురక్షిత స్థావరమని, ఇక్కడ 7 ప్రాంతాల్లో 60 గూళ్లలో రాబందులున్నాయని అధికారులు తెలిపారు.

పాల ఉత్పత్తులు పెంచేలా ఆవులకు బహుమతులు

పెరంబూర్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తులు పెంచేలా ఆవులను ఎంపిక చేసి బహుమతులు అందించనున్నట్లు డెయిరీ శాఖ మంత్రి ఆర్ఎస్ రాజకన్నప్పన్ తెలిపారు. ఈ మేరకు మంత్రి విడుదల చేసిన ప్రకటనలో... సహకార సంఘాల ద్వారా పాల ఉత్పత్తిదారులకు రూ.2వేల కోట్ల మేర పశువుల సంరక్షణకు రుణాలందించామన్నారు. ఈ పథకం ద్వారా 5 లక్షల మంది పాల ఉత్తత్తిదారులు లబ్ధిపొందుతున్నారని తెలిపారు. పాల ఉత్పత్తులు పెంచేలా అధిక పాలు అందించే మూడు ఆవులను ఎంపిక చేసి వాటి యజమానులకు బహుమతులు అందించనున్నామని మంత్రి తెలిపారు.

ఎస్ఐపై దాడి: నలుగురు రౌడీల అరెస్టు

అడయార్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా బన్రుట్టి సమీపంలో ముద్దాండి కుప్పం పోలీస్ స్టేషన్ ఎస్ఐ శివరామన్ (49)పై ఇనుప రాడ్లతో దాడి చేసిన కేసులో నలుగురు రౌడీలను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం రాత్రి ఎస్ఐ వాహనాల తనిఖీ చేస్తుండగా నలుగురు యువకులు రెండు ద్విచక్రవాహనాలో వేగంగా వచ్చారు. వారిని ఆపేందుకు శివరామన్ ప్రయత్నింగా ఇనుపరాడ్లతో దాడి చేసి పారిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ ఫుటేజీ ఆధారంగా దాడికి పాల్పడింది అశోక్ రామన్, బాలశ్రీధర్, మణివేల్, గోపిఅనే వారిగా గుర్తించి అరెస్టు చేశారు. వీరంతా ఆ ప్రాంతంలో రౌడీలుగా చెలామణి అవుతున్నారు. కేసు విచారణ జరుపుతున్నారు.

- పొల్లాచ్చి కేసు...

సీబీఐ కోర్టుకు 9 మంది నిందితులు

అడయార్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పొల్లాచ్చి అత్యాచార కేసు విచారణలో అభియోగాలు ఎదుర్కొంటున్న తొమ్మిది మంది నిందితులన కోయంబత్తూరు సీబీఐ కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో ప్రభుత్వ తరఫున సాక్షుల విచారణ ముగిసింది. దీంతో ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న తొమ్మిది మంది నిందితులను సేలం సెంట్రల్ జైలు నుంచి కోవై సీబీఐ కోర్టుకు తీసుకొచ్చారు. ఈ కేసులో తిరునావుక్కరసు, శబరిరాజన్, వంసత్ కుమార్, సతీష్ , మణివణ్ణన్ అనే ఐదుగురు నిందితులను 2019లోనూ, హేరేన్ పాల్, బాబు , అరులానందం, అరుణ్ కుమార్ అనే వారిని 2021లో అరెస్టు చేశారు.

పాత పింఛన్ విధానమే కావాలి

- ప్రభుత్వ మాజీ ఉద్యోగుల నిరసన

వేలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పాత పింఛను విధానమే కావాలని ప్రభుత్వ మాజీ ఉద్యోగుల సంఘం నిర్వాహకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వేలూరు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి మైకేల్‌రాజ్ మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రభుత్వ మాజీ ఉద్యోగులకు ఇచ్చే పింఛన్ విధానంలో మార్పులు చేస్తూ జారీచేసిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలంటూ డిమాండ్ చేశారు.

నేడు సీటీఏ ఆధ్వర్యంలో సీతారామ కల్యాణం

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక వలసరవాక్కంలోని చెన్నై తెలుగు అసోసియేషన్ (సీటీఏ) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం సీతారామ కల్యాణమహోత్సవం నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్షుడు కె.గోపాలకృష్ణారెడ్డి, కార్యదర్శి బి. వెంకయ్యానాయుడు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. పోరూరు గణపతినగర్ ఆర్కాట్‌రోడ్డు పిళ్లయార్ కోయిల్ వీధిలోని రాజలక్ష్మి మహల్‌లో నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 9 నుంచి రాములవారి కల్యాణోత్సవాన్ని జరుపనున్నామని తెలిపారు. కళ్యాణోత్సవం తర్వాత అందరికీ విందు భోజన కార్యక్రమం కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నగరంలోని తెలుగువారంతా ఈ వేడుకలకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

ఆస్తి పన్ను చెల్లింపులపై 5 శాతం రాయితీ

పెరంబూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత గడువులో ఆస్తి పన్ను చెల్లించి 5 శాతం రాయితీ పొందవచ్చు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో ఏడాది రెండు అర్ధవారికాలు రెండు విడతలుగా ఆస్తి పన్ను వసూలుచేస్తుంటారు. 2025-26వ ఆర్థిక సంవత్సరానికి మొదటి అర్ధవార్షిక పన్ను ఈ నెల 30వ తేది లోగా చెల్లించి 5 శాతం (అధికంగా రూ.5,000) వరకు రాయితీ పొందవచ్చిని జీసీసీ ప్రకటనలో తెలిపింది. కాగా, ఇదే రాయితీని ఈ ఏడాది కోవై, మదురై కార్పొరేషన్లలో కూడా అమలుచేశారు.

- పుచ్చకాయలపై దుష్ప్రచారం...

ఆహార భద్రతాధికారిపై బదిలీ వేటు

టి.నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పుచ్చకాయల్లో తీపి, ఎరుపు రంగు కోసం ఇంజెక్షన్ల ద్వారా రసాయనాలు కలుపుతున్నారంటూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన దుష్ప్రచారానికి మద్దతిచ్చారనే ఆరోపణలతో చెన్నై జోన్ ఆహార భద్రతాధికారి సతీష్‌కుమార్‌పై బదిలీ వేటు పడింది. పుచ్చకాయలపై వచ్చిన దుష్ప్రచారం కారణంగా రాష్ట్ర మంతటా పుచ్చకాయల అమ్మకాలు బాగా తగ్గిపోయాయని, పొలాల వద్ద వాటిని కొనుగోలు చేయడానికి కూడా వ్యాపారులు ఆసక్తి చూపటం లేదని చెంగల్పట్టు రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశన్ ఆరోపించారు. ఇంజెక్షన్ల ద్వారా పుచ్చకాయల్లో రసాయనాలు కలుపుతున్నారంటూ సోషల్‌మీడియాలో వచ్చిన వార్తలను ఖండించకపోగా రసాయనాలు కలిపే అవకాశముందంటూ ఆహార భద్రతా అధికారి సతీష్‌కుమార్ ఇటీవల సైదాపేటలో పుచ్చకాయలలో ఇంజెక్షన్ ద్వారా ఎలా రసాయనాలు కలుపుతారో మీడియా ఎదుట ప్రదర్శించారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం సతీష్‌కుమార్‌ను వైద్య, గ్రామీణ సంక్షేమ సంస్థకు బదిలీ చేసింది. అంతే కాకుండా ట్రిప్లికేన్‌లో ఓ బిర్యానీ హోటల్‌లో బిర్యాని తిన్నవారు అస్వస్థతకు గురైన సంఘటనలో ఆ హోటల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోకుండా సతీష్‌కుమార్ తనిఖీలను ఆపి వెళ్ళారని, ఇలాంటి ఆరోపణే మరో హోటల్‌పై వచ్చినా ఆ హోటల్‌లో కనీసం తనిఖీకి కూడా వెళ్లలేదని ఆరోపణలు వచ్చాయి. ఈ ఆరోపణలన్నింటి కారణంగానే ఆయనపై బదిలీ వేటుపడింది. ఇక సతీష్‌కుమార్ స్థానంలో తిరువళ్లూరు జిల్లా ఆహార భద్రతా విభాగం అధికారి బోస్ చెన్నై జోన్ అధికారిగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారని ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది.



బదిలీకి గురైన సతీష్‌కుమార్

పుదుకోటలో యువకుడి దారుణహత్య

- అర్ధరాత్రి బంధువుల రాస్తారోకో

టి.నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా కరంబక్కుడి సమీపం మలయూరు ప్రాంతానికి చెందిన మురుగేశన్ (25) అనే యువకుడిని శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వేట కొడవళ్లతో దాడి చేసిదారుణంగా హతమార్చారు. ఈ ఘటన కారణంగా మలయూరు ప్రాంతంలో మురుగేశన్ బంధువులు, స్థానికులు రాస్తారోకో చేయడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. మురుగేశన్ శుక్రవారం రాత్రి బజారు వీధి నుంచి బైకులో ఇంటికి వెళ్తుండగా టాస్మాక్ దుకాణం సమీపంలో గుర్తు తెలియని దుండగులు కత్తులు, వేటకొడవళ్లతో దాడి జరిపి పారిపోయారు. ఈ సంఘటనలో మురుగేశన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అదే సమయంలో పుదుకోట వైద్యకళాశాల ఆసుపత్రి సమీపంలోనూ మురుగేశన్ బంధువులు రహదారిపై నిలిచి హంతకులను అరెస్టు చేయాలని నినాదాలు చేస్తూ ధర్నాకు దిగారు. పోలీసులు గాలించి ఈ హత్యకు సంబంధించిన ఇద్దరిని అరెస్టు చేశారు.



రాస్తారోకో చేస్తున్న మురుగేశన్ బంధువులు (ఇన్‌సెట్‌లో) హత్యకు గురైన మురుగేశన్

స్టేషన్‌లో ఆగకుండా వెళ్లిన రైలు...

వెనక్కి వచ్చి ప్రయాణికులను ఎక్కించుకున్నవైనం

పెరంబూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో ఆగకుండా వెళ్లిన రైలు, మళ్లీ వెనక్కువచ్చి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్లిన ఘటన పాపనాశంలో జరిగింది. మైలాడుదురై నుంచి తిరుచ్చికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఉదయం 8.50గంటలకు తంజావూరు జిల్లా పాపనాశం రైల్వేస్టేషన్‌లో నిమిషం ఆగుతుంది. ఈ నేపథ్యంలో, శనివారం ఉదయం రైలు కోసం అందరూ ఎదురుచూస్తుండగా వచ్చిన రైలు స్టేషన్‌లో ఆగకుండా వెళ్లిపోవడంతో ప్రయాణికులు దిగ్భ్రాంతి చెందారు. సుమారు కి.మీ వెళ్లిన రైలు మళ్లీ వెనక్కి వచ్చి, ప్రయాణికులు ఎక్కిన తర్వాత తిరుచ్చికి బయల్దేరి వెళ్లింది.

చదురగిరి ఆలయానికి భక్తుల నిషేధం

పెరంబూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): చదురగిరి కొండ ఆలయానికి ప్రతిరోజు భక్తులు వెళ్లేందుకు నిషేధం విధించారు. విరుదునగర్ జిల్లా వత్తిరాయిరుప్పు సమీపంలోని పశ్చిమకనుమల్లో చదురగిరి సుందర, చందన మహాలింగం ఆలయానికి ప్రతినెలా ప్రదోషం, అమావాస్య, పౌర్ణమి తదితర విశేషరోజుల్లో మాత్రమే భక్తులు ఆలయానికి వెళ్లేందుకు అనుమతిస్తున్నారు. ఇటీవల చదురగిరి ఆలయానికి ప్రతిరోజు భక్తులను అనుమతించనున్నట్లు జిల్లా యంత్రాంగం ప్రకటించింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కొండ ఆలయానికి వెళ్లే మార్గంలో నీటి ప్రవాహం అధికమైంది. దీంతో కొండ ఆలయానికి భక్తులు వెళ్లేందుకు తాత్కాలికంగా నిషేధం విధిస్తున్నట్లు తెలిపింది.

విపత్తుల ఆర్థిక సాయం రాష్ట్రానికి రూ.522.43 కోట్లు

పెరంబూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విపత్తుల ఆర్థిక సాయం కింద రాష్ట్రానికి రూ.522.34 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రకృతి విపత్తులు ఎదుర్కొన్న తమిళనాడు, హిమాచల్‌ప్రదేశ్, పుదుచ్చేరి, బీహార్ తదితర రాష్ట్రాలకు అదనపు కేంద్రం నిధుల సాయంగా రూ.1,280.35 కోట్లు కేటాయిస్తూ కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా నేతృత్వంలో ఉన్నత స్థాయి కమిటీ ఆమోదం తెలిపింది. ఆ ప్రకారం, బీహార్‌కు రూ.588.73 కోట్లు, హిమాచల్ ప్రదేశ్‌కు రూ.136.22 కోట్లు, తమిళనాడుకు రూ.522.34 కోట్లు, పుదుచ్చేరికి రూ.33.06 కోట్లు కేటాయించారు.

వేదారణ్యం ఎన్‌టీకే అభ్యర్థిగా ఇడుంబావనం కార్తీక్



చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలకంటే ముందుగా నామ్‌తమిళర్ కట్చి (ఎన్టీకే) నాయకుడు సీమాన్ అభ్యర్థుల ఎంపికలో ముందున్నారు. వేదారణ్యం నియోజకవర్గంలో పార్టీ యువజన విభాగం సమన్వయకర్త ఇడుంబావనం కార్తీక్ పోటీ చేయనున్నారని సీమాన్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

సత్తువచ్చారిలో డీఎండీకే బహిరంగ సమావేశం

వేలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేలూరులో సత్తువచ్చారిలో డీఎండీకే ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బహిరంగ సమావేశాన్ని నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి రజిని, సెల్వకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా చేనేతకార విభాగం దేవరాజ్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా, సుమారు వెయ్యి మంది మహిళలు పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడు జగదీశన్, మహిళ ఉప కార్యదర్శి శుభ మంగళం, కోశాధికారి సెందిల్‌కుమార్, శ్రీనివాసన్, అబ్దుల్ రసూల్, షణ్ముగం, శరవణన్ తదితరులు పాల్గొన్నారు.

అన్నైకట్టులో...

వేలూరు జిల్లా అన్నైకట్టులో డీఎంకే ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బహిరంగ సమావేశం జరిగింది. ఈ క్రమంలో డీఎంకే ముస్లిం విభాగం నాయకుడు మహ్మద్ జాఫర్ మాట్లాడుతూ కొత్తగా ప్రవేశ పెడుతున్న నూతన వక్ఫ్ బోర్డు చట్టాన్ని అమలు చేసి ముస్లిలకు తీరని ద్రోహం తలపెడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నైకట్టు డీఎంకే కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

తిరుప్పూరులో నీటమునిగిన రైతు బజారు

- కాగితపు పడవలతో రైతుల నిరసన

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు సౌత్ ప్రాంతంలోని రైతు బజారు గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా జలమయమైంది. జిల్లాలోని పొంగలూరు, కాట్టూరు, కాట్టూరుపుదూరు, ఉగయనూరు, నార్త్ అవినాశిపాళయం, సౌత్ అవినాశిపాళయం తదితర ప్రాంతాల్లోని రైతులు తాము సాగు చేసిన పండ్లు, కూరగాయాలను రైతుబజార్‌కు తరలించి విక్రయిస్తుంటారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుండి శనివారం వేకువజాము వరకు కురిసిన భారీ వర్షానికి రైతు బజార్‌లో వర్షపునీరు రెండడుగుల మేర వరదలా ప్రవహించింది. దీంతో రైతులు తీసుకువచ్చిన తమ ఉత్పత్తులు ఆ రైతు బజార్‌లో విక్రయించలేకపోయారు. సంబంధిత అధికారులు మోటారు పంపులతో వాననీటిని ముందుగానే తొలగించి ఉంటే ఈ పరిస్థితి తమకు ఏర్పడేది కాదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో రైతు బజారులో చేరిన వాననీటిని తొలగించని అధికారుల వైఖరిని ఖండిస్తూ రైతులు వాననీటిలో కాగితపు పడవలు వేసి ఆందోళన జరిపారు.



రైతుబజార్‌లో వాననీటిలో కాగితపు పడవలు విడిచిపెడుతున్న రైతులు

ఉత్పత్తిలోనే కాదు...

అన్ని రంగాల్లో అభివృద్ధి

ప్యారీస్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఉత్పత్తిలోనే కాకుండా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని రాష్ట్ర మంత్రి టీఆర్బీ రాజా పేర్కొన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, 2021లో రాష్ట్ర అసెంబ్లీకు జరిగిన ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించిన డీఎంకేను అదే స్థాయితో రాబోయే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా గెలిపించేందుకు రాష్ట్రప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని రాష్ట్రప్రభుత్వం బహుళ జాతి సంస్థల పెట్టుబడులను ఆకట్టుకునేలా చేపట్టిన ప్రయత్నాలు మంచి ఫలితాలిచ్చాయన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రం కేవలం ఉత్పత్తి రంగంలోనే కాకుండా మిగిలిన అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని మంత్రి తెలిపారు.



మంత్రి టీఆర్బీ రాజా

'హరికథాలహరి - నిత్యనూతన సుధామాధురి'పై 20న ప్రభల జానకి ప్రసంగం

టి.నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేదవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక 160వ ప్రసంగ కార్యక్రమం ఈ నెల 20 ఆదివారం జరుగనుంది. 'హరికథాలహరి-నిత్యనూతన సుధామాధురి' అనే అంశంపై ప్రముఖ రచయిత్రి, పరిశోధకులు డా. ప్రభల జానకి ప్రసంగించనున్నారని వేదిక అధ్యక్షులు జేకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు ఓ ప్రకటనలో తెలిపారు. టి.నగర్‌లోని ఆంధ్రాక్లబ్ కృష్ణాహాల్‌లో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తెలుగు సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులేనని పేర్కొన్నారు.

స్టాండింగ్ కమిటీ సలహాను కేంద్రం పాటించేనా?

- మూడు రాష్ట్రాలకు నిధులు విడుదలయ్యేనా?
- కాంగ్రెస్ నేత పి. చిదంబరం

టి.నగర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సూచన మేరకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చెల్లించాల్సిన విద్యాపరమైన నిధులను విడుదల చేస్తుందని తాను ఆశిస్తున్నట్లు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం పేర్కొన్నారు. ఇటీవల జరిగిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కేరళకు రూ.328కోట్లు, రాష్ట్రానికి రూ.2,151 కోట్లు, పశ్చిమబెంగాల్‌కు రూ.1745 కోట్ల మేరకు నిధులు ఏ మాత్రం జాప్యం లేకుండా చెల్లించాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఆ సలహా పాటించి, పెండింగ్‌లో ఉంచిన నిధులను తక్షణమే చెల్లిస్తుందనం తాను ఆశిస్తున్నానన్నారు. కొత్త విద్యావిధానం అమలు చేయలేదన్న కక్షతో ఈ మూడు రాష్ట్రాలకు నెలల తరబడి పెండింగ్‌లో ఉంచిన నిధులను విడుదల చేయకపోవడం గర్హనీయమని కూడా పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పేర్కొన్నట్లు చిదంబరం తన ఎక్స్ పేజీలో వెల్లడించారు. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సలహాను కేంద్రం పాటించి నిధులను మూడు రాష్ట్రాలకు విడుదల చేస్తుందా? లేక మునుపటిలా నిధులు విడుదల చేయకుండా మొండి వైఖరిని అవలంభిస్తుందా? అని వేచి చూస్తున్నానని చిదంబరం పేర్కొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

వేలూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా కాట్పాడి సమీపంలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులను శనివారం కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. ఈ క్రమంలో ఆమె అధికారులతో మాట్లాడుతూ, పట్టణాభివృద్ధి శాఖ నిధులతో ప్రారంభమైన భూగర్భ డ్రైనేజీ పనులను వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ జానకి రవిచంద్రన్, ఇంజనీర్ నిత్యానందం, అసిస్టెంట్ కమిషనర్ సతీష్‌కుమార్, ప్రభుత్వాధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల కేసు నుంచి తప్పించండి

- జ్ఞానశేఖరన్ పిటిషన్

పెరంబూర్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపుల కేసు నుంచి తప్పించాలని కోరుతూ జ్ఞానశేఖర్ కోర్టులో పిటిషన్ వేశాడు. అన్నా యూనివర్సిటీలో విద్యార్థినిపై లైంగిక వేధింపులకు గురిచేసినట్లు గత ఏడాది డిసెంబరు 25న జ్ఞానశేఖరన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంపై బీజేపీకి చెందిన న్యాయవాది ఎ.మోహన్ దాస్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... డీఎంకే కార్యకర్త కావడంతో జ్ఞానశేఖర్ కేసు పోలీసుల విచారణలో వాస్తవాలు బయటకురావని, సీబీఐ, ప్రత్యేక దర్యాప్తు బృందంచే విచారణ జరిపేలా ఉత్తర్వులివ్వాలని పిటిషన్‌లో కోరారు. ఈ కేసు విచారించిన హైకోర్టు, జ్ఞానశేఖరన్‌పై ఉన్న కేసుల వివరాలు తెలుపాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు పంపింది. అలాగే, ఈ కేసు విచారణకు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం ఇటీవల ఛార్జీషీటు దాఖలుచేసింది. ఈ నేపథ్యంలో విద్యార్థిని లైంగిక వేధింపుల కేసు నుంచి తనను తప్పించాలంటూ జ్ఞానశేఖర్ పిటిషన్ దాఖలుచేశాడు. పిటిషన్‌లో... ఎలాంటి ఆధారాలు లేకుండా ప్రత్యేక విచారణ బృందం అత్యవసర ఛార్జీషీటు దాఖలుచేసిందని పేర్కొన్నారు. అల్లికులం న్యాయమూర్తి సెలవుపై ఉండంతో ఈ కేసు చెన్నై పోక్సో న్యాయస్థానంలో విచారణ జరుగుతోంది. ఈ కేసు విచారణకు జ్ఞానశేఖర్ హాజరుకాగా, ఈ పిటిషన్‌పై 7వ తేదిలోగా అఫిడివిట్ దాఖలుచేయాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

రేపు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు

ప్యారీస్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): టి.నగర్‌లోని పీఆర్సీ సెంటినరీ హాలులో లయన్స్ ఇంటర్నేషల్ డిస్ట్రిక్ట్ 324ఇ- 2024-2025 ఆధ్వర్యంలో సోమవారం విశ్వావసు నామ ఉగాది వేడుకలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు పంచాంగ పఠనం, మ్యూజిక్ అండ్ క్లాసికల్ డాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేడుకల్లో భాగంగా వ్యాపార రంగంలో రాణిస్తున్న గోపురం కుంకుమ గ్రూప్ సంస్థల అధినేత లయన్ వైవి. హరికృష్ణకు ఐకాన్ పురస్కారంతో సత్కరించనున్నారు. ఉగాది మహోత్సవ డిస్ట్రిక్ట్ ఛైర్‌పర్సన్ లయన్ కె.కోటేశ్వర చౌదరి, లయన్ వి.దామోదర్ సారథ్యం వహించనున్న ఈ వేడుకల్లో డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన టి.మురుగేష్‌కుమార్ ముఖ్యఅతిథిగా, గౌరవ అతిథులుగా లయన్ ఆర్.సంపత్, అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి, వీజీఎన్ సంస్థల అధినేత వీఎన్.దేవదాస్, ఆత్మీయ అతిథిగా ప్రముఖ సినీనటి రోహిణి తదితరులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఆలయ ప్రాంగణంలోని దుకాణాలు తొలగించండి

తిరుత్తణి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరువలంగాడులో ప్రసిద్ధి చెందిన వఠారణ్యేశ్వరాలయ గోపురం వద్ద అనధికారంగా ఏర్పాటు చేసిన దుకాణాలు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ రద్దీ ఏర్పడి భక్తులకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. దీనిపై గత ఏడాది వినతిపత్రాలు సమర్పించగా, స్పందించిన ఆలయ అధికారులు, ప్రభుత్వం ఏర్పాటు చేసిన షాపులను ఆ వ్యాపారులకు కేటాయించారు. తిరిగి మళ్లీ అదే ప్రదేశంలో దుకాణాలు ఏర్పాటుచేసుకున్నారు. దీనిపై ఆలయ ప్రభుత్వ అధికారులు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

నేడు సీతారామనగర్‌లో నవమి వేడుకలు

ప్యారీస్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక మూలకడై సమీపంలోని సీతారామనగర్‌లో తెలుగు ప్రజాసంక్షేమ సంఘ కార్యాలయ భవనంలో 28వ వార్షిక సీతారాముల కల్యాణమహోత్సవం నిర్వహించనున్నట్లు అధ్యక్షులు బి.సురేష్‌బాబు, కార్యదర్శి పి.లక్ష్మణరావు, కోశాధికారి డి.పిచ్చేశ్వరరావులు ఓ ప్రకటనలో తెలిపారు.

రామ్‌నగర్‌లో....

స్థానిక ట్రిప్లికేన్ రామ్‌నగర్‌లోని కోదండరామ భక్తజన బృందం ఆధ్వర్యంలో ఆదివారం సీతారామ కల్యాణం నిర్వహించనున్నారు. 12వ తేదీ శనివారం వసంతోత్సవం, ప్రత్యేక ఆరాధన, స్వామివారి ఊరేగింపు జరుగుతుందని రామ్‌నగర్ ఆదిఆంధ్ర సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.బాబు, కార్యదర్శి పి.నరసింహులు, కోశాధికారి పురుషోత్తం, దర్శిగుంట శేషయ్య కిషోర్‌లు పిలుపునిచ్చారు.



మట్టికుండ కావాలా... కారుకురిచ్చి పోదాం



ఈ యేడాది ఫిబ్రవరి రెండో వారం నుంచే సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నాడు. ఎండలు మండిపోతున్నాయి. శరీరంలో నీరు ఈ వేడికి ఆవిరై పోతున్నాయి. చల్లచల్లని నీళ్లు తాగనిదే ఉపశమనం లభించదు. ఫ్రిజ్ నీళ్లు ఎన్ని తాగినా దాహం తీరదు. ఫ్రిజ్‌వాటర్ తాగితే జలుబు చేస్తుంది. కొంతమందికి పళ్లు జివ్వుమంటాయి. ఐస్ వాటర్ గబగబా రెండు గ్లాసులు తాగినా, ఓ గ్లాసు మట్టికుండలోని నీళ్లకు సాటి రావు. వేసవిలో అందరి దాహాన్నీ తీర్చడంతో పాటు బోలెడన్ని ప్రయోజనాలను అందిస్తుంది మట్టికుండ. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అధికమైన ఈ యుగంలోనూ మట్టి కుండలను ఉపయోగించే వారున్నారు. ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మట్టి కుండల్లోని నీళ్లనే తాగుతున్నారు. మట్టి పాత్రల్లో వంటలు కూడా చేస్తున్నారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి

వడదెబ్బ నుంచి...

ఈ ఎండల్లో కాసేపు బయట తిరిగినా, వడగాలులు దేహాన్ని తాకినా వడదెబ్బ తగులుతుంది. అలా జరగకుండా ఉండాలంటే మట్టి పాత్రలలో నిల్వచేసిన నీళ్ల తాగటం మంచిదంటున్నారు ఆరోగ్యనిపుణులు. ఈ నీళ్ల గ్లూకోజ్ స్థాయిని అదుపులో ఉంచి వడదెబ్బనుంచి కాపాడతాయని చెబుతున్నారు. జీర్ణ సంబంధిత సమస్యలకు ఖనిజలవణాలు అధికంగా ఉండే మట్టికుండలోని నీళ్ల తాగడం చాల మంచిందంటున్నారు. ఇంతటి విశేషాలను కలిగి ఉండటం వల్లే మట్టి కుండలను పేదింటి ఫ్రిజ్‌లు అని చెబుతున్నారు. తమిళ నాగరికత ఆరంభం నుంచి నేటి దాకా తమిళులు అధికంగా మట్టితో తయారైన అలంకరణ వస్తువులతోపాటు వంట పాత్రలు కూడా వాడుతూనే ఉన్నారు.





● విదేశాల్లోనూ ఈ 'పేదింటి ఫ్రిజ్'లకు గిరాకీ!

ప్రస్తుతం నగరాలలో అక్కడక్కడా ఆరోగ్యం పట్ల అవగాహన ఉన్నవారు మట్టి కుండలలోని నీటినే తాగుతున్నారు. కాకపోతే నగరాల్లో కుండలు కొళాయిలతో ఉంటాయి అంతే! మూడు దశాబ్దాలకు ముందు వరకు వంటకు, తాగునీటికి, పొంగళ్లు పెట్టడానికి మట్టితోతయారైన వస్తువులే వాడుతుండేవారు. ఆలయాలలో మట్టి పళ్లెంలో దేవతా మూర్తులకు కర్పూర హారతినిచ్చేవారు. పూజారులు భక్తులకు మట్టి పళ్లెంలో ఉంచిన విభూది, కుంకుమను ఇచ్చేవారు. ఆలయ ప్రసాదాలను కూడా మట్టితోతయారైన ప్రమిదల్లాంటి చిన్న సైజు పళ్లెంలో అందించేవారు. కాలగమనంలో ఇవన్నీ అదృశ్యమయినా నగరాల్లో అక్కడక్కడా ఇప్పటికీ మట్టి కుండలు దర్శనమిస్తాయి. ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి దూరంగా ఉన్న కుగ్రామాల్లో ఇప్పటికీ మట్టి పాత్రలు, కుండలే ఉపయోగిస్తున్నారు.





కారుకురిచ్చి ప్రత్యేకత...

ఇక యేటా మార్చి నుంచి జూన్ వరకు రాష్ట్రంలో కుండలకు గిరాకీ అధికంగా ఉంటుంది. ఈ కుండల తయారీలో అన్ని జిల్లాల కంటే తిరునల్వేలి జిల్లా ముందంజలో ఉంది. ఆ జిల్లాలోని మేల్‌పాళయం కురిచ్చి, చేరన్ మాదేవి సమీపంలోని కారుకురిచ్చి తదితర ప్రాంతాల్లోని కుమ్మరులు వంశపారంపర్యంగా మట్టి కుండలు, పాత్రలను లక్షల సంఖ్యలో తయారు చేస్తున్నారు. ఇక్కడి తయారయ్యే కుండలు, పాత్రలు రాష్ట్రం నలుమూలలకు సరఫరా అవుతున్నాయి. అంతే కాకుండా కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక తదితర పొరుగు రాష్ట్రాలకు, అరబ్బు దేశాలకు, మలేసియా, సింగపూరు, జర్మనీ, అమెరికా వంటి దేశాలకు ఎగుమతి అవుతున్నాయంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ కుండలు ఇక్కడి నుండే విదేశాలకు యేటా ఓడల్లో సరఫరా అవుతున్నాయి.



ప్రమిదల నుంచి బిర్యానీ కుండల దాకా...

ఇప్పటికీ కారుకురిచ్చిలో తయారవుతున్న ప్రమిదలు, తేనీరు ముంతలు, వాటర్ బాటిళ్ల, పూలకుండీలు, సాంబ్రాణి పాత్ర, బిర్యానీ కుండలు, సూప్ గిన్నెలు, సంక్రాంతికి, ఆలయాల వద్ద దేవతా మూర్తులకు పొంగళ్లుపెట్టే పెద్ద సైజు కుండలకు మంచి డిమాండ్ ఉంది. ఈ ప్రాంతంలో తయారవుతున్న మట్టి కుండలు, మట్టిపాత్రలు ధరలు వాటి సైజులను బట్టి రూ.150లు నుంచి రూ.600 దాకా ఉంటాయి. ఇవన్నీ పొరుగు రాష్ట్రాలకు, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. 5 లీటర్ల సామర్థ్యంతో మూత కలిగిన కుండలు రూ.100, 8 లీటర్ల సామర్థ్యంతో కుండలు రూ.120, 10 లీటర్ల సామర్థ్యంతో కుండలు రూ.185కు విక్రయిస్తున్నారు.

వంశపారంపర్యం... : మేల్‌పాళయం కురిచ్చి, కారుకురిచ్చి గ్రామాల్లోని కుమ్మరులంతా ఉపాధి లేకపోయినా ఇతర ప్రాంతాలకు వలస పోకుండా కుల వృత్తిని విడువకుండా వంశపారంపర్యంగా మట్టిపాత్రలు, కుండలు, ప్రమిదలను తయారు చేస్తున్నారు. బంగారానికి హాల్‌మార్క్ ఉన్నట్లే కుండల నాణ్యతకు కారుకురిచ్చి పేరుగాంచింది. ప్రస్తుతం వేసవి అధికంగా ఉండటంతో ఈ ప్రాంతంలోని కుమ్మరులంతా కుండల తయారీలో తలమునకలవుతున్నారు. ప్రకృతితో మమేకంగా ఉండే పర్యావరణ ప్రేమికులు ఉన్నంత వరకు కుమ్మరులు కళాత్మకంగా తయారు చేసే మట్టి పాత్రలు, కుండలకున్న మోజు ఎన్నటికీ తగ్గదనడం అతిశయోక్తి కాదేమో? ఈ వేసవిలో మట్టి కుండల్లోని నీళ్లను తాగి కుమ్మరుల మనస్సును చల్లబరుద్దాం!

పా.రంజిత్ దర్శకత్వంలో శోభిత?



శోభిత ధూలిపాళ్ళ

మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన 'పొన్నియిన్ సెల్వన్' చిత్రంలో నటించి తమిళ ప్రేక్షకులకు దగ్గరైన తెలుగు నటి శోభిత ధూలిపాళ్ళ, కాగా ఈమె పా.రంజిత్ దర్శకత్వంలో నటించనున్నట్టు కోలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. 'వేట్టువం' అనే పేరుతో పా.రంజిత్ స్వీయ నిర్మాణంలో దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో దినేష్ హీరోగా నటించనున్నారు. ప్రతినాయకుడి పాత్రలో హీరో ఆర్య నటించనుండగా, ఇతర పాత్రలో మరో హీరో అశోక్ సెల్వన్, మలయాళ నటుడు ఫహద్ ఫాజిల్ తదితరులు కీలక పాత్రలు పోషించనున్నారు. ఇందులో శోభితను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. పా.రంజిత్ సొంత నిర్మాణ సంస్థ నీలం స్టూడియోస్‌తో కలిసి గోల్డెన్ రేషియో ఫిలిమ్స్ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. పూర్తి వివరాలతో అధికారిక ప్రకటన త్వరలోనే విడుదల చేయనుంది.

తమిళ చిత్రజ్యోతి

జీవీ ప్రకాష్ - సైంధవి హాజరుకావాలి : కోర్టు ఆదేశం

తమ మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా విడిపోవాలని నిర్ణయం తీసుకున్న ప్రముఖ సంగీత దర్శకుడు, హీరో జీవీ ప్రకాష్ కుమార్, ఆయన భార్య, సినీ నేపథ్యగాయని సైందవి సెప్టెంబరు 25న కోర్టుకు హాజరుకావాలని చెన్నై ఫ్యామిలీ కోర్టు ఆదేశించింది. ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ 2013లో తన బాల్య స్నేహితురాలు, నేపథ్యగాయని సైందవిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఓ కుమార్తె కూడా ఉంది. అయితే వివాహం అయిన 12 యేళ్ల తర్వాత మనస్పర్థల కారణంగా వీరిద్దరూ పరస్పర అంగీకారంతో విడిపోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం విడాకులు కోరుతూ చెన్నై ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ వేయగా, ఇప్పటికే వారిద్దరూ స్వయంగా ఒకసారి కోర్టుకు కూడా హాజరయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి సెల్వ సుందరి విచారణ జరిపి, తదుపరి విచారణకు జీవీ ప్రకాష్ కుమార్, సైందవి కోర్టుకు హాజరుకావాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను సెప్టెంబరు 25వ తేదీకి వాయిదా వేశారు.



జీవీ ప్రకాష్ - సైంధవి

అభిమానులు ఆశించే అంశాలతో 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ట్రైలర్

ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అగ్ర నటుడు అజిత్ కుమార్ హీరోగా నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రం ట్రైలర్‌ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేయగా, ఇందులో అజిత్ ఫ్యాన్స్ ఆశించే అన్ని అంశాలున్నాయి. ఈ నెల 10వ తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చే ఈ మూవీలో త్రిష హీరోయిన్‌గా నటించారు. సునీల్, అర్జున్ దాస్, రాహుల్ దేవ్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే రిలీజైన ఫస్ట్‌లుక్, టీజర్, ఇతర పోస్టర్లు అజిత్ ఫ్యాన్స్‌ను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో తాజాగా రిలీజ్ చేసిన ఈ చిత్రం ట్రైలర్ ఆడియన్స్‌కు గూస్‌బమ్స్ తెప్పించేలా ఉన్నాయి. రెండు నిమిషాల నిడివితో ఉన్న ఈ వీడియోలో క్రేజీ యాక్షన్ డ్రైవ్‌ను దర్శకుడు చూపించారు. అలాగే, హీరో అజిత్‌ను వివిధ గెటప్స్‌లో, డిఫరెంట్ లుక్స్‌లో ప్రెజెంట్ చేశారు. పైగా 'గుడ్ బ్యాడ్ అగ్లీ' అనే టైటిల్‌కు తగినట్టుగానే హీరో పాత్రలో భిన్నమైన కోణాలున్నట్టు తెలుస్తోంది.



'గుడ్ బ్యాడ్ అగ్లీ'లో అజిత్

25న మిర్చి శివ 'సుమో'



'సుమో'లో ఓ దృశ్యం

చాలాకాలం క్రితం నిర్మాణం పూర్తి చేసుకున్న 'సుమో' చిత్రాన్ని ఈ నెల 25న విడుదల చేయనున్నారు. ఎస్పీ హోసమిన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మిర్చి శివ హీరోగా నటించారు. డాక్టర్ ఐసరి కె.గణేష్ సమర్పణలో వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పతాకంపై తెరకెక్కింది. ఎపుడో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని పలుమార్లు విడుదల చేసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఇపుడు నిర్మాత ఐసరి కె.గణేష్ చేసిన కృషి ఫలితంగా విడుదలకు సిద్ధమైంది. మిర్చి శివ సరసన ప్రియా ఆనంద్ హీరోయిన్‌గా నటించారు. వీటీవీ గణేష్ ఓ ముఖ్య పాత్ర పోషించారు. జపాన్‌కు చెందిన సుమో రెజ్లర్ యోషినోరి తషిరో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ సింహభాగం జపాన్‌లో చిత్రీకరించారు. దీంతో జపాన్‌లో కూడా ఈ మూవీని రిలీజ్ చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. ఇండో - జపనీస్ నేపథ్యంలో సుమోల జీవితాల ఆధారంగా రూపొందించిన తొలి భారతీయ చిత్రం కావడం గమనార్హం.

పళనిలో నేత్రపర్వంగా పంగుణి ఉత్తిరం ఉత్సవాల ప్రారంభం



ఇష్టదేవేరులతో ముత్తుకుమారస్వామి, ధ్వజారోహణం చేస్తున్న ఆలయ ప్రధానార్చకులు

చెన్నై, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): తమిళుల ఆరాధ్య దైవం మురుగప్పెరుమాన్ కొలువుదీరిన ఆరుదివ్యక్షేత్రాల్లో రెండవదైన పళని దండాయుధపాణి ఆలయంలో శనివారం ఉదయం పంగుణి ఉత్తిరం ఉత్సవాలు నేత్రపర్వంగా నిర్వహించారు. పళని ఆలయంలోని నవపాషాణంతో తాయరైన మూలవిరాట్టును వేసవితాపం నుండి కాపాడేలా ప్రతియేటా తైపూసం, పంగుణి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. తైపూసం ఉత్సవాల సందర్భంగా రాష్ట్రం నలమూలల నుండి భక్తులు పూలకావళ్లతో పాదయాత్రగా ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. ఇంతటి విశేషాలను సంతరించుకున్న ఈ ఆలయంలో ఈ యేడాది పంగుణి ఉత్తిరం వేడుకలు పళని పర్వతాలయ ఉపాలయంగా ఉన్న తిరు ఆవినన్ కుడిలో ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ముందుగా శుక్రవారం రాత్రి గ్రామశాంతి, వాస్తుశాంతి పూజలు, అస్త్రదేవుడి ఊరేగింపు తదితర కార్యక్రమాలు జరిగాయి. శనివారం ఉదయం తిరుఆవినన్‌కుడి ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యావహచనం అనంతరం కోడిపుంజు, నెమలి చిత్రాలతో కూడిన ధ్వజ పతకాన్ని ధ్వజస్తంభం ఎదుట ఉంచి పూజలు చేశారు. ముత్తుకుమారస్వామి, వళ్ళి, దైవానై అమ్మవార్లకు పంచామృతం సమా 16 రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. చివరగా ముత్తుకుమారస్వామివారు వళ్ళి, దైవానై సమేతంగా సప్పరంలో కొలువుదీరారు. ఆ తర్వాత అస్త్రదేవుడు, విఘ్నేశ్వరుడి విగ్రహాల ముందు మయూర యాగం, వాద్యపూజలు జరిగాయి. ఉదయం 11 గంటలకు శైవాగమ పండితులు మంత్రోచ్చారణ నడుమ ధ్వజారోహణం నిర్వహించారు. ఓదువార్లు తిరుమురై గానం చేసిన తర్వాత ధ్వజస్తంభంతో పాటు ముత్తుకుమారస్వామి, వళ్ళిదైవానై అమ్మవార్లకు దీపారాధన చేశారు. ఈ వేడుకలను పురస్కరించుకుని పళని పర్వతాలయంలో ఉచ్చికాల పూజలో మూలవర్లకు 16 రకాల అభిషేకం, అలంకారం నిర్వహించారు. ఆ తర్వాత మూలవర్ల సన్నిధిలో ఉన్న విఘ్నేశ్వరస్వామికి కంకణధారణ జరిగింది. షణ్ముఖుడు, ఉత్సవర్లు, ద్వారపాలకులు, మయూర వాహనం, పెరియనాయకి అమ్మవారి ఆలయంలో సోమస్కందుడు, పరమేశ్వరుడు, పెరియనాయకి అమ్మవారు, నటరాజస్వామి, శివగామి అమ్మవార్లకు కూడా కంకణ ధారణ చేశారు. ఈ ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ముత్తుకుమారస్వామి, వళ్ళి, దైవానై తిరుకల్యాణోత్సవం ఈ నెల 10 రాత్రి జరుగనుంది.. ఈ నెల 11న పంగుణి ఉత్తిరం సందర్భంగా గిరి వీధుల్లో రథోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో జరిగే స్వర్ణ రథం ఊరేగింపు కార్యక్రమాలు ఈ నెల 9 నుండి 13 వరకు ఐదురోజులపాటు నిలిపివేస్తున్నారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ కమిషనర్ మారిముత్తు, వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

దార్శనిక నాయకుడు బాబు జగ్జీవన్‌రామ్

● ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కర్రా లోకేష్

● ఘనంగా జాతీయ సమతా దినోత్సవం



బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ప్యారీస్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అంటరాని తనం నిర్మూలనకు, చట్టసభల్లో ఎస్సీఎస్టీలకు రిజర్వేషన్‌కు కీలకపాత్ర పోషించి, ఉపప్రధానిగా సేవలందించిన బాబు జగ్జీవన్‌రామ్ దార్శనిక నేత అని ఎమ్మార్పీఎస్ తమిళనాడు విభాగం అధ్యక్షుడు కర్రా లోకేష్ కొనియాడారు. స్వతంత్ర భారత తొలి కార్మిక శాఖా మంత్రిగా బోనస్‌ను చట్టబద్ధం చేయడం, రైల్వేశాఖా మంత్రిగా పేదవారి కోసం జనతా రైలు పరిచయం చేసి, రక్షణ శాఖామంత్రిగా శతృదేశమైన పాకిస్థాన్ సైన్యాన్ని బెంబేలెత్తించిన బాబు జగ్జీవన్‌రామ్ 107వ జయంతిని శనివారం జాతీయ సమతా దినోత్సవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చేపాక్-ఏళిలగం ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో వున్న బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం ముందు ఆయన చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ తరుపున నివాళులర్పించారు. కర్రా లోకేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎం.కొండయ్య, కార్యదర్శి కె.సుకుమార్, ఉప కార్యదర్శి దర్శిగుంట కిషోర్, బి.వసంత్‌రావు, ఎస్.ఆనంద్ రావు, విశ్వప్రసాద్, వి.కుమార్, ఆర్.దేవదానం, పెంచలయ్య, లోకనాధన్, అరుణాచలం, భాస్కర్, సెల్వం తదితరులు పాల్గొన్నారు.

స్నో కింగ్‌డమ్‌లో హిమ సోయగాలు

● మండుటెండల్లో మంచుదుప్పటి

అడయార్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన వీజీపీ గోల్డెన్ బీచ్‌లో కృత్రిమంగా సృష్టించిన స్నో కింగ్‌డమ్‌లో కశ్మీర్, సిమ్లా మంచు సోయగాలు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. వీటితో పాటు మైనస్ 8 డిగ్రీలో అంటార్కిటికాలో ఉండే అతిశీతల వాతావరణం ఇక్కడ నెలకొంది. శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్నో కింగ్‌డమ్ మార్కెటింగ్ మేనేజింగ్ డైరెక్టర్ షిమోర్ మాట్లాడుతూ, వేసవిలో చెన్నై నగర వాసులు తీవ్రమైన వేసవి తాపాన్ని ఎదర్కొంటారన్నారు. ఈ మండుటెండల్లో అతిశీతల వాతావరణాన్ని ఆస్వాదించేలా స్నో కింగ్‌డమ్‌ను నిర్మించామన్నారు. ఏడాది పొడవునా తెరిచివుంటుందని, ఇది నగర వాసులకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందన్నారు. ముఖ్యంగా ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా మంచు వాతావరణాన్ని ఆస్వాదించేందుకు బారులు తీరుతున్నారన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరిచివుంటుందని, దీన్ని సందర్శించే సందర్శకుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉలెన్ సాక్సులు, మంచు నుంచి రక్షణ కల్పించేలా బూట్లు, స్నో జాకెట్స్, చేతులకు గ్లౌజులను కూడా సమకూర్చుతున్నామన్నారు. మంచులో ఆడుకునే విధంగా స్నో స్లైడ్స్, మౌంటెన్ క్లైమింగ్, రాంపోలెంట్, స్కేటింగ్ వంటివి ఏర్పాటు చేశామన్నారు.



స్నో కింగ్‌డమ్‌లో సందర్శకుల ఆనందం



చెన్నై మైలాపూరు కపాలీశ్వరాలయ పంగుణి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం అధికారనందిపై ఆశీనులై ఊరేగుతున్న కర్పగాంబాళ్ సమేత కపాలీశ్వరస్వామి

తేనెలూరించే 'రామ కథాసుధ'

వేళచ్చేరి, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని దుర్గా స్రవంతి (సాంస్కృతిక విభాగం) దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళాసభ సంయుక్తంగా సమర్పించిన 'రామ కథాసుధ' అమృత వర్షం కురిపించింది. శనివారం సాయంత్రం మైలాపూర్ లజ్ చర్చ్ రోడ్డులోని ఆంధ్ర మహిళా సభ హాలులో ఈ కార్యక్రమం జరిగింది. ప్రఖ్యాత 'కథకుల' బృందం ప్రదర్శించిన 'రామ కథా సుధ' ప్రేక్షకులను ఎంతో అలరించింది. లక్ష్మీప్రసన్న ప్రార్థనాగీతంతో ప్రారంభించి, సభకు స్వాగతం పలికారు. భారతీయ కథకుల కోసం భానుమతి క్లుప్తంగా తెలియజేశారు. 'ఏమి రామ కథ శబరీ శబరీ' అంటూ గాయని లక్ష్మీప్రసన్న శ్రావ్యంగా గానంచేశారు. బాలాంత్రపు లావణ్య సారథ్యంలో 'రామ కథా సుధ' విలక్షణమైన ప్రక్రియలో ప్రదర్శింపబడింది. ఆంగ్లభాషలో తోలుబొమ్మల ప్రదర్శన ద్వారా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన కథాకులు అద్భుతంగా రామకథను కథాకథనం చేయడంలో ఒక కొత్తదనం చూపించారు. రామకథ ఆద్యంతం ప్రేక్షకులను కట్టిపడేసింది. చెన్నైలోని ప్రఖ్యాత కథకురాలు లావణ్య నృత్యంలో 'భారతీయ కతకులు' రామ కథాసుధను ప్రదర్శించిన విధానం అద్వితీయం. రమ్యా శ్రీనిధి, సరిత, అనఘప్రసాద్, లావణ్య ప్రసాద్, అంబుజవల్లి, ఆయుష్య అగర్వాల్, లావణ్య, బిర్దాని బాదురి, పార్వతి ఈశ్వరన్, శ్రీమతి జైశంకర్, సి.మంగళం, కథాకారులు దేశంలోని వివిధ ప్రాంతాలనుండి వచ్చి 'రామ కథా సుధ' ప్రదర్శనలో పాలుపంచుకున్నారు.



కళాకారులతో నిర్వాహకులు



సీజేఐ దంపతులకు ప్రసాదాలు ఇస్తున్న ఈవో శ్యామలరావు

అమ్మవారి సేవలో సీజేఐ

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా శనివారం రాత్రి తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద టీటీడీ ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, జేఈవో వీరబ్రహ్మం, అర్చకులు ఆలయ మర్యాదలతో జస్టిస్‌కు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి, అమ్మవారి మూలవర్లను దర్శించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయనతో పాటు పలువురు న్యాయమూర్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. సీజే రాక సందర్భంగా ఆలయం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

'కల్కి2'కి ఇంకా టైం ఉంది : నాగ్ అశ్విన్

రెబల్ స్టార్ ప్రభాస్ 'కల్కి-2'పై దర్శకుడు నాగ్ అశ్విన్ స్పందించారు. తిరుమల శ్రీవారిని శనివారం సుప్రభాతసేవలో దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. కల్కి సెకండ్ పార్టు ఎప్పుడు రాబోతోందని మీడియా అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ఇంకా టైం పడుతుందన్నారు. కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకోడం సంతోషంగా ఉందన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని అన్ని కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలో 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,327

తలనీలాలు సమర్పించినవారు: 26,354



కౌసల్యా సుప్రజా రామా...

సప్తగిరుల్లోనూ మార్మోగే శ్రీరామనామం

అన్ని అర్చనలు, సేవల్లోనూ ఆయనకు స్థానం

నేడు శ్రీరామనవమి ఆస్థానానికి ఘనంగా ఏర్పాట్లు



యుగపురుషుడు శ్రీరామచంద్రమూర్తి త్రేతాయుగానికే పరిమితం కాదు. కాలమేదైనా ధర్మానికీ, జనరంజక పాలనకూ ఆయనే ఆదర్శం. కలియుగ వెంకన్న కొలువైన తిరుమలలోనూ ఈ జగదభిరాముడి ప్రస్తావన వినిపిస్తూనే ఉంటుంది. కనిపిస్తూనే ఉంటుంది. శ్రీవారిని మేలుకొలుపే 'కౌసల్యా సుప్రజారామా, పూర్వా సంధ్యా ప్రవర్తతే...' అంటూ ఈ జగదానందకారకుడి నామ స్మరణతోనే లోకాన్ని మేల్కొలుపుతారు. తిరుమల క్షేత్రంలో కొలువుదీరి ఉన్న శ్రీరాముడి విగ్రహం వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగింది. తిరుమల శ్రీనివాసుడితో పాటు పూజలందుకుంటోంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అదిగదిగో రాములవారి మేడ

తిరుమల బంగారువాకిలి నుంచి వేంకటేశ్వరుడి గర్భాలయంలోకి వెళ్లే మార్గంలో స్నపనమండపం దాటగానే 'రాములవారిమేడ' దర్శనమిస్తుంది. అక్కడ రాములవారి పరివారమైన అంగద, హనుమంత, సుగ్రీవుల విగ్రహాలుంటాయి. ప్రస్తుతం గర్భాలయంలో శ్రీనివాసుడి మూలమూర్తితో పాటు సీతారామలక్ష్మణుల విగ్రహాలు పూజలందుకుంటున్నాయి. ఈ విగ్రహాలు పూర్వం రాములవారిమేడలో ఉండేవని చెబుతారు. అందువల్లే రాములవారి మేడగా పిలుచుకుంటున్నారు.



తెప్పోత్సవాల్లో తొలిరోజు విహారం

ఏటా ఐదు రోజుల పాటు జరిగే వార్షిక తెప్పోత్సవాల్లో తొలిరోజు తెప్పపై కొలువుదీరేది శ్రీరామచంద్రుడే. పుష్కరిణిలో తెప్పపై సీతాలక్ష్మణ ఆంజనేయ సమేతంగా నీలమేఘశ్యాముడు దివ్యతేజస్సుతో విహరిస్తూ భక్తకోటికి దర్శనమిస్తారు. వసంతోత్సవాల్లో తొలి రెండు రోజులు మలయప్పస్వామికి స్నపన తిరుమంజనం నిర్వహించే అర్చకులు చివరిరోజు కృష్ణస్వామిని, రాములవారిని ఒకే వేదికపై కొలువుదీర్చుతారు. వారికీ స్నపనం నిర్వహిస్తారు. ఒకే వేదికపై కనిపించే ఈ ఇద్దరు యుగపురుషులను చూడటానికి భక్తులు ఎంతో ఆసక్తి కనబరుస్తారు.

బ్రహ్మోత్సవాల్లో కోదండరాముడిగా దర్శనం

ఏటా బ్రహ్మోత్సవాల్లోనూ ఆరో రోజు హనుమంత వాహనంపై శ్రీవారే కోదండరాముడిగా మాడవీధుల్లో విహరించి దర్శనమిస్తారు. త్రేతాయుగంలో తనకు సేవ చేసిన భక్త శిఖామణి హనుమంతుడిని వాహనంగా చేసుకుని తిరువీధుల్లో ఊరేగుతారని చెబుతారు. హనుమంతుడి భక్తి తత్పరతను ఈకాలం నాటి వారికి చాటిచెబుతూ రాముడు, కృష్ణుడు, వేంకటేశ్వరుడు అన్నీ తానేనని తెలియజేస్తారు. రథసప్తమి నాడూ హనుమంత వాహనంపై దర్శనమిస్తారు.

జన్మ నక్షత్రం నాడు ఊరేగింపు

ఆయా మాసాల్లో వచ్చే ప్రత్యేక నక్షత్రాలకు తగినట్టు మలయప్పస్వామి దర్శనమిస్తుంటారు. శ్రీరాముడు జన్మనక్షత్రమైన పునర్వసు రోజున శ్రీవారి ఆలయంలో ఆస్థానం, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. సీతారామలక్ష్మణస్వామిని పీఠంలో అధిరోహింపజేసి విశేష ఆభరణాలు, పూలమాలలతో అలంకరించి సహస్ర దీపాలంకార సేవను నిర్వహిస్తారు. శ్రీరామచంద్రమూర్తి ఆంజనేయస్వామి సమేతంగా తిరుమాడవీధుల్లో ఊరేగుతారు.

ప్రియ సేవకుడు కొలువుదీరిందిక్కడే

రాముడి విశ్వాసపాత్రుడైన సేవకుడు ఆంజనేయస్వామి కొలువైంది కూడా ఏడుకొండల్లోని అంజనాద్రే. తల్లి అంజనాదేవితో కలిసి బాలాంజనేయస్వామి నేటికీ ఆకాశగంగ తీర్థం వద్ద భక్తులకు దర్శనమిస్తున్నారు. అంజనాద్రే ఆంజనేయుడి జన్మస్థలమని ఇటీవల కొన్ని పండిత బృందాలు కూడా శాస్త్రపరంగా నిరూపించాయి. విశిష్టత కలిగిన జపాలి క్షేత్రం కూడా అంజనాద్రిపైనే వెలసింది. జపాలి మహర్షి కోరిక మేరకు ఆంజనేయస్వామికి స్వయంభువుగా వెలసినట్టుగా చారిత్రక ఆధారాలున్నాయి. స్కందపురాణం, వేంకటాచల మహత్యంలోనూ ఈ క్షేత్రం గురించి ప్రస్తావించారు. రావణ సంహారం తర్వాత సీతా సమేతంగా అయోధ్యకు వెళ్లే ముందు శ్రీరాముడు జపాలి తీర్థంలో కొంతకాలం విడిది చేసినట్టు మరో ఐతిహ్యం ప్రాచుర్యంలో ఉంది.

నేడు శ్రీరామనవమి ఆస్థానం

శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఆస్థానాన్ని వైభవంగా నిర్వహించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయక మండపంలో సీతాలక్ష్మణ సమేత హనుమంతుల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. వేదమంత్రోచ్చరణల నడుమ అభిషేకం చేస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమంతవాహన సేవ జరుగనుంది. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య బంగారువాకిలిలో శ్రీరామనవమి ఆస్థానం నిర్వహిస్తారు. మరుసటి రోజు రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య శ్రీరామ పట్టాభిషేకాన్ని వైభవంగా చేపట్టనున్నారు.

కిడ్నాప్ కేసులో నిందితుల అరెస్టు

రెండు కార్లు, కత్తులు, మొబైల్ ఫోన్లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తిరుపతి జీవకోనలో కుటుంబ సభ్యుల కిడ్నాప్ కేసులో ఇద్దరు నిందితులను శనివారం అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. శనివారం డీఎస్పీ శ్రీలత మీడియాకు తెలిపిన వివరాలివి.... తిరుపతి జీవకోనలో ఉంటున్న కసారం రాజేష్ మీ-సేవ నిర్వహిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ భార్గవ్ ఇతనికి స్నేహితుడు. రాజేష్‌కు అతని తల్లి విజయ పేరుతో విలువైన పొలాలు, ఆస్తులున్నాయని భార్గవ్ తెలుసుకున్నాడు. దీంతో రాజేష్‌ను, కుటుంబసభ్యులను బెదిరించి రూ.2 కోట్లు లాక్కోవాలని పథకం పన్నాడు. బీ-టెక్ చదివి అప్పటికే నేరాలతో సంబంధమున్న వట్టికుంట అరుణ్‌కుమార్‌తో చేతులు కలిపాడు. పన్నాగంలో భాగంగా గతనెల 28న రాజేష్‌కు ఫోన్ చేశారు. బీమా పాలసీ చేయించడానికి తల్లిని తీసుకురావాలని నమ్మపలికారు. దీంతో రాజేష్ తన తల్లిని తీసుకుని భార్గవ్ ఉంటున్న ఫ్లాట్‌కు వచ్చాడు. అరుణ్, భార్గవ్‌లు వెంటనే వారిద్దరినీ గదిలో బంధించారు. ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఉన్న రూ1.5 కోట్లు డ్రా చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారు స్పందించకపోవడంతో రాజేష్ భార్య సుమతి, ఇద్దరు చిన్న పిల్లలను కూడా తీసుకొచ్చారు. అయినా చలించకపోవడంతో మరుసటి రోజు (29న) తెల్లవారుజామున సుమతి, ఆమె అత్తను, ఇద్దరు పిల్లలను కిడ్నాప్ చేసి కారులో బెంగళూరుకు వెళ్లారు. మరో వాహనంలో రాజేష్‌ను కిడ్నాప్ చేసి చిత్తూరు వైపు బయలుదేరారు. అయితే ఐతేపల్లి వద్ద రాజేష్ చాకచక్యంగా వాహనం బ్రేక్ వేసి డోర్ తీసి కారు నుంచి బయట పడ్డాడు. దీంతో అరుణ్‌కుమార్ ఆగ్రహంతో రాడ్‌తో రాజేష్‌పై దాడి చేసి అదే వాహనంలో వెళ్లిపోయారు. తీవ్రంగా గాయపడిన రాజేష్ వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి పోలీసులకు జరిగిన విషయం తెలియజేశాడు. స్థానికులు అతడ్ని తిరుపతి రుయాలో చేర్పించారు. తమ ప్లాన్ బెడిసికొట్టిందని తెలుసుకున్న నిందితులు రాజేష్ చిత్తూరులో విజయను వదలి పెట్టారు. సుమతిని బెంగళూరులోని ఆమె పుట్టింటి సమీపాన విడిచివెళ్లారు. పిల్లలను కూడా వదిలేశారు. అలిపిరి పోలీసులు కిడ్నాప్ కేసును సీరియస్‌గా పరిగణించారు. గాలింపు ముమ్మరం చేశారు. రేణిగుంట-కడప రోడ్డులో కుక్కల దొడ్డి వద్ద ప్రధాన నిందితులు అరుణ్‌కుమార్, భార్గవ్‌లతో పాటు పలు కేసులతో సంబంధమున్న సాయికుమార్, మణికంఠ, ప్రకాష్, గణేష్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కార్లు, ఏడు మొబైల్ ఫోన్లు, నాలుగు కత్తులు, మత్తు పదార్థాలు, ఐరన్ రాడ్‌తో పాటు వివిధ రకాల వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్టులో కీలక పాత్ర పోషించిన సీఐ రాంకిషోర్, ఎస్‌ఐలు లోకేష్‌బాబు, నాగార్జున రెడ్డిలను ఎస్పీ అభినందించారు.

నిందితులు పాతనేరస్థులే..

కిడ్నాప్ యత్నం కేసులో నిందితుడు అరుణ్‌కుమార్‌ది గరుడాద్రినగర్. ఇతనే ఈ వ్యవహారమంతా నడిపించాడని పోలీసులు గుర్తించారు. 2015లో స్నేహితుడు దిలీప్‌ను మోసం చేసి హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడు. ఇతడిపై నాలుగు క్రిమినల్ కేసులు, ఏటీఎం చోరీ కేసు, కిడ్నాప్ కేసులు, ఇతర ఆర్థిక మోసాల కేసులున్నాయి. రౌడీ షీట్ కూడా ఉంది. మరో నిందితుడు భార్గవ్‌పై హత్య కేసుతో పాటు కిడ్నాప్, బైండోవర్ కేసులు నమోదయ్యాయి. ఇతనిపై తిరుపతి పోలీసులు రౌడీషీట్ నమోదు చేశారు.

సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్షకు 1,888 మంది హాజరు



ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల వద్ద విద్యార్థులను తనిఖీ చేసి లోనికి అనుతిస్తున్న అధికారులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సైనిక్ స్కూల్ ప్రవేశాలకు నేషనల్ టెస్ట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు జిల్లాలో 1,888 మంది హాజరయ్యారు. తిరుపతిలో నాలుగు కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల, గీతం, శ్లోక ఎ బిర్లా, ఢిల్లీ పబ్లిక్ స్కూళ్లలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఎన్‌టీఏ నిబంధనల ప్రకారం పరీక్ష సమయానికి అర్ధగంట ముందే 1.30 గంటలకు పరీక్ష కేంద్రాల గేట్లు మూసివేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మధ్యాహ్నం 12 గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలకు 2,125 మంది దరఖాస్తు చేసుకోగా 237 మంది గైర్హాజరయ్యారని ఎన్‌టీఏ సిటీ కోఆర్డినేటర్ టి. కైలాస్‌నాథ్ చెప్పారు.

జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యుల ఎంపిక

కమిటీలో పద్మావతి వర్సిటీ ప్రొఫెసర్



కలికిరి/కడప, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఏర్పాటు కానున్న జువెనైల్ జస్టిస్ బోర్డు సభ్యులను ఎంపిక చేసేందుకు ఒక ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటితో పాటు రాష్ట్రంలోని మిగతా 13 కొత్త జిల్లా కేంద్రాల్లో జువెనైల్ జస్టిస్ బోర్డులు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ మేరకు బోర్డులో చైర్మన్, సభ్యుల పదవుల కోసం ఆసక్తి ఉన్నవారు ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు పంపుకోవాలని కోరుతూ ప్రభుతవం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ బోర్డుకు అర్హులైన చైర్మన్, సభ్యులను ఎంపిక చేయడానికి తాజాగా ప్రభుత్వం ఒక ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కమిటీ చైర్మన్‌గా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి యు.దుర్గాప్రసాదరావును నియమించారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఆ శాఖ కార్యదర్శి వ్యవహరించనున్నారు. సభ్యులుగా తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వి.లలితకుమారి, కడప యోగివేమన వర్శిటీ సైకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లలిత, ఏపీ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతితో పాటు ఒక యునిసెఫ్ ప్రతినిధి, సౌత్ రీజినల్ రిసోర్స్ సెంటర్ ఫర్ చిల్డ్రన్ ఇండియా ఫౌండేషన్ నుంచి మరో ప్రతినిధినితో ఈ ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటయింది. మూడేళ్లపాటు ఈ కమిటీ కార్యకలాపాల్లో పాల్గొంటుందని పేర్కొంటూ రాష్ట్ర స్త్రీ, బాలల, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారి ఆదేశాలు జారీ చేశారు.

పోలీసుల అదుపులో బంగారం దోపిడీ ముఠా

- రెండు రోజుల్లో దోపిడీ కేసును ఛేదించిన పోలీసులు
- ప్రధాన నిందితుడు కేజీఎఫ్ కాంగ్రెస్ నేతగా గుర్తింపు
- డ్రైవర్ వద్ద తీగలాగితే.. దోపిడీ డొంక కదిలింది

వి.కోట, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం నాయకనేరి అటవీ ప్రాంతంలో కారును అడ్డగించి బంగారాన్ని దోచుకెళ్లిన కేసును పోలీసులు రెండు రోజుల్లోనే ఛేదించారు. ఎస్పీ మణికంఠ ఆదేశాలతో డీఎస్పీ డి.ప్రభాకర్ నేతృత్వంలో నాలుగు పోలీసు బృందాలు చాకచక్యంగా అంతర్రాష్ట్ర దోపిడీ ముఠాను అదుపులోకి తీసుకున్నాయి. కర్ణాటక రాష్ట్రం కేజీఎఫ్‌కు చెందిన వ్యాపారి వద్ద పనిచేస్తున్న వాహన డ్రైవర్ వద్ద తీగలాగితే దోపిడీ డొంక మొత్తం కదిలినట్లు సమాచారం.కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన ముఠా సభ్యులు సినీఫక్కీలో వ్యూహరచన చేసి పక్కా ప్రణాళికతో కారు ప్రయాణించే మార్గంలో నిర్మానుష్య ప్రాంతాన్ని దోపిడీకి అనువుగా ఉంటుందని ఎంచుకున్నారు. బుధవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో తమిళనాడు సరిహద్దులు దాటాక బంగారు కడ్డీలను తరలిస్తున్న కారును గుర్తించి మరో కారులో వెంబడించారు. నాయకనేరి అటవీ ప్రాంతంలో కత్తులు చూపించి కారును ఆపారు. కారు వెనుక సీట్లో కూర్చొన్న వ్యక్తిని కత్తులతో బెదిరించి బంగారం ఉన్న కారు డిక్కీ తాళాలను తీసుకుని, అందులోని బంగారాన్ని తస్కరించి కారులో పరారయ్యారు. ఘటన జరిగింది అటవీ ప్రాంతం కావడంతో తీవ్ర భయాందోళనకు లోనైన బాధితులు జరిగిన దోపిడీని యజమానికి వివరించి, ఆయన సూచన మేరకు వి.కోట పోలీసులకు ఫిర్యాదు చేశారు.సీఐ సోమశేఖర్ ఎస్పీకి సమాచారం ఇచ్చి నాలుగు బృందాలతో దర్యాప్తు మొదలెట్టారు. బంగారం తరలిస్తున్న కారును గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.అతడి సెల్ ఫోన్ డేటా ఆధారంగా అసలు నిందితులను గుర్తించినట్లు సమాచారం. పాత నేరస్థులు జట్టుగా ఏర్పడి సులువుగా డబ్బు సంపాదించాలన్న లక్ష్యంతో ఈ దోపిడీకి పాల్పడినట్లు గుర్తించారు.కేజీఎఫ్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ ప్రముఖుడి నేతృత్వంలో ఈ దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది.అతడితో పాటు ఇతర నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. వారి వద్ద దోపిడీ చేసిన బంగారంలో 3.5 కిలోలను రికవరీ చేసి 8మందిని అరెస్టు చేసినట్లు సమాచారం. మరో పావు కిలో బంగారాన్ని రికవరీ చేయడంతో పాటు మిగిలిన నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది.కేజీఎఫ్ అధికార పార్టీ నేతను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో అతడిని విడిపించేందుకు అక్కడి అధికార పార్టీ పెద్దలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి.

రేణిగుంట అర్బన్ సీఐకి చార్జి మెమో

- ఎస్‌ఐ అరుణ్‌కుమార్‌పై విచారణకు ఎస్పీ ఆదేశం

రేణిగుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ నుంచి అంతర్రాష్ట్ర దొంగ పారిపోయిన ఘటనలో అర్బన్ సీఐ శరత్‌చంద్రకు ఎస్పీ చార్జి మెమో ఇచ్చారు. అలాగే అర్బన్ ఎస్‌ఐ అరుణ్ కుమార్‌రెడ్డిపై విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఇటీవల అంతర్రాష్ట్ర దొంగ పరారైన ఘటనపై ఎస్పీ హర్షవర్ధన్ రాజు సీరియస్ కావడంతో ఇద్దరు ఐడీ పార్టీ కానిస్టేబుళ్లపై ఇదివరకు సస్పెన్షన్ వేటు పడగా ఇదే ఘటనపై స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ బాధ్యత వహిస్తూ సీఐకు చార్జి మెమో జారీ చేశారు.

8న వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ఆందోళన

అడయార్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఈ నెల 8వ తేదీన అన్ని జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఆందోళనలు చేయనున్నట్టు డీపీఐ ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్ వెల్లడించారు. ఆయన శనివారం తిరుచ్చి విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ, ఈ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామని, ఇదే విషయంపై ఈ నెల 8వ తేదీన అన్ని జిల్లా ప్రధాన కేంద్రాల్లో ఆందోళన చేయనున్నట్టు వెల్లడించారు.

ఇబ్బందులు తొలగి అభివృద్ధివైపు అడుగులు..

- ఎమ్మెల్సీ సోము వీర్రాజు

తిరుమల, ఏప్రిల్5(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దయతో రాష్ట్రంలోని ఇబ్బందులన్నీ తొలిగి అభివృద్ధివైపు అడుగులేస్తున్నామని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. బీజేపీ నేతలు సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డితో కలిసి ఆయన శనివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. 2014 నుచి 2024 వరకు అనేక ఇబ్బందులు పడ్డామని, ప్రస్తుతం రాష్ట్రం రాజధాని, స్టీల్ ప్లాంట్, పోలవరం వంటి అనేక అంశాల్లో ప్రగతిని సాధిస్తోందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఈ వయస్సులోనూ నిరంతరం పర్యటన చేస్తున్నారని, వారితో పాటు డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ కూడా అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వారి ఆరోగ్యాన్ని కాపాడేలా ఆశీర్వదించమని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు. ఇక, శ్రీవారి నిధులను ధర్మానికే కేటాయించాలన్నారు. ఈ సంకల్పంతో భానుప్రకాష్ రెడ్డి పనిచేస్తున్నారని ప్రసంశించారు.



వేసవి వేడుకలకు ఏర్కాడు ముస్తాబు



ప్యారీస్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలో పేదల ఊటీగా పేరొందిన ఏర్కాడు వేసవి వేడుకలకు వివిధ అంశాలతో అందంగా ముస్తాబవుతోంది. ఉద్యాన వన శాఖ అధికారులు ఈ ఏడాది కూడా పర్యాటకులను ఆకట్టుకునేలా వేసవి వేడుకలు నిర్వహించేందుకు భారీస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు ఏర్కాడులోని రోజ్ గార్డెన్‌లో సుమారు 15వేలకు పైగా పూల కుండీలలో నాటిన పూల మొక్కలను శ్రద్ధగా సంరక్షిస్తున్నారు. పర్వత శ్రేణులపై రమ్యమైన ప్రకృతి, చల్లదనం నిండిన ఏర్కాడుకు వేసవి సీజన్‌లో మే నుంచి జూన్ నెల వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలనుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా పర్యాటకులు వచ్చి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని చూసి వెళ్తుంటారు. ఈ ఏడాది ఉత్సవాలు 10 రోజుల పాటు నిర్వహించేందుకు ఉద్యానవన శాఖ, పర్యాటక శాఖల సంయుక్తంగా ఏర్పాట్లు చేపట్టాయి. అన్నా పార్కులో లక్షలాది పూలతో బొమ్మల ఆకృతులు, అరుదైన పూల ప్రదర్శన నిర్వహించనున్నారు. అదేవిధంగా ఏర్కాడు ప్రాంతంలో రైతులు పండిస్తున్న పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు తదితరాలతో ప్రదర్శన నిర్వహించనున్నారు. ఏర్కాడును సందర్శించనున్న సందర్శకులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు.